క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని 11కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా శనివారం పట్టణంలోని విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సంబంధిత అధికారులు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రామయ్యబౌలి, మోటర్‌లైన్, మైత్రినగర్, పాతపాలమూర్, జైల్ ఖానా, బాలాజీ నగర్, భగీరథ కాలనీ, భూలక్ష్మి, ఆదర్శనగర్, డబుల్‌బెడ్రూం ఇళ్లు, నాగేంద్రనగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

కుట్టుశిక్షణ కేంద్రం పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: పట్టణంలోని బోయపల్లిలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ద్వారా మహిళలకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. అనంతరం కంటి వెలుగు కేంద్రాన్ని తనిఖీ చేశారు.

బీజేపీ సంబరాలు

పాలమూరు: ఈశాన్య రాష్ట్రాలైన త్రిపుర, మేఘాలయ, నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ గెలుపొందిన సందర్భంగా ఆ పార్టీ నేతలు సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయం నుంచి తెలంగాణ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆ తర్వాత బాణాసంచా కాల్చి.. మిఠాయిలు పంపిణీ చేశారు. కాగా.. అంతకు మునుపు పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి పి.చంద్రశేఖర్ మాట్లాడారు. బీఆర్ఎస్ నేతలు పెంచిన సిలిండర్ ధరలపై ధర్నాలు చేయడం వరకు బాగానే ఉన్నా.. పెంచిన విద్యుత్, బస్సు చార్జీలు, రిజిస్ట్రేషన్ ధరలపై ఎందుకు ప్రశ్నించడం లేదంటూ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్పీ వెంకటేష్, కృష్ణవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అంజయ్య, రాజుగౌడ్ పాల్గొన్నారు.

డంపింగ్‌యార్డు పరిశీలన

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కోయిల్‌కొండ ఎక్స్ రోడ్డులోని డంపింగ్ యార్డును శుక్రవారం మున్సిపల్ కమిషనర్ డి.ప్రదీప్‌కుమార్ పరిశీలించారు. అక్కడ పెంచుతున్న మొక్కలకు నీరు పోశారు. అనంతరం బోయపల్లిలో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. కాగా సీసీరోడ్డు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు.

లీకేజీలు సరిచేయండి..

స్థానిక క్రిస్టియన్‌పల్లిలోని ప్రభుత్వ ఎంవీఎస్ జూనియర్ కళాశాల ఆవరణలో ఉన్న మిషన్ భగీరథ పథకం పైపులైన్‌కు చెందిన రెండు ఎయిర్ వాల్వ్‌లను శుక్రవారం పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ వైష్ణవి పరిశీలించారు. అక్కడ లీకేజీ ఏర్పడి తాగునీరు వృథా అవుతుండటాన్ని గమనించి వెంటనే సరి చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని ఓబ్లాయిపల్లి శివారులో గల మన్యంకొండ అలివేలు మంగమ్మ ఆలయ ప్రాంగణంలో ఈజీఎస్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ చంద్రకళ శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

గండేడ్: మండలంలోని సాలార్‌నగర్‌లో సీసీ రోడ్డు పనులను సర్పంచ్ సత్యమ్మ శుక్రవారం ప్రారంభించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరయ్యాయి.

కొనసాగుతున్న వెరిఫికేషన్

జడ్చర్ల టౌన్: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల రికార్డుల వెరిఫికేషన్ కొనసాగుతుంది. మండలంలోని స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వివేకానంద, యుగంధర్, దేవ్యానాయక్, మల్లయ్యలతో కూడిన నాలుగు బృందాలు వెరిఫికేషన్ నిర్వహిస్తున్నాయి. శుక్రవారం మండలంలోని గొల్లపల్లి, కోడ్గల్, పట్టణంలోని అక్షర పాఠశాలల్లో బృందాలు వెరిఫికేషన్ నిర్వహించాయి.

అప్రమత్తంగా ఉండాలి

చిన్నచింతకుంట: సైబర్‌నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ భాగ్యలక్ష్మారెడ్డి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలో సైబర్ నేరాలు, డ్రంక్ అడ్ డ్రైవ్, బాల్యవివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మందు సేవించి వాహనాలు నడపరాదన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

బాలానగర్: రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ సమీపంలోని రాఘవేంద్ర కాటన్‌మిల్లులో రైతుల పత్తిని తూకం చేసేటప్పుడు భారీగా అవకతవకలకు పాల్పడుతున్నారని, అధికారులు విచారణ చేసి యాజమాన్యంపై చర్యలు చేపట్టాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆది రమణారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెండు రోజుల కిందట పెద్దరేవల్లి నుంచి పత్తిని తీసుకెళ్లగా, 45కేజీలు తక్కువగా చూపారని అన్నారు.

గాయపడిన వ్యక్తికి ఆర్థికసాయం

చిన్నచింతకుంట: మండలంలోని బండ్రపల్లికి చెందిన బొల్లు వెంకట్రాములు కొన్ని రోజుల కిందట ప్రమాదవశాత్తు రెండు కాళ్లు కోల్పోయాడు. విషయం తెలుసుకున్న బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎగ్గని నర్సింహులు శుక్రవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నారాయణరెడ్డి, ఆంజనేయులు, రవి, రామంజనేయులు, శ్రీను, నవీన్ ఉన్నారు.

కార్పొరేట్‌కు కొమ్ముకాస్తున్న కేంద్రం

- సిలిండర్ ధరల పెంపుతో పేదలపై భారం
- జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



చిన్నచింతకుంటలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట: పేదల కడుపుకొట్టి పెద్దలకు పెట్టే కార్పొరేట్ కేంద్ర ప్రభుత్వాన్ని సాగనంపేందుకు మరెన్నో రోజులు లేవని జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం పెంచిన సిలిండర్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు.

దేవరకద్ర: పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా స్థానిక పాత బస్టాండ్‌లో బీఆర్ఎస్ నాయకులు నిరసన తెలిపారు. కేంద్రం ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు అమ్మేస్తూ ఆదానీ, అంబానీలకు అనుకూలంగా చట్టాలను తెస్తున్నారని ఆరోపించారు. ధర్నాలో ఖాళీ గ్యాస్ సిలిండర్‌ను ప్రదర్శించి నిరసన తెలిపారు.

అడ్డాకుల: అడ్డాకుల, మూసాపేట మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ నాయకులు వంట గ్యాస్ ధరల పెంపుపై ఆందోళన చేశారు. మూసాపేటలో గ్యాస్ సిలిండర్ల ఎదుట కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన తెలిపారు.

భూత్పూర్: కేంద్ర ప్రభుత్వం పేద ప్రజలపై అదనపు భారం మోపుతున్నారని మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ ఆరోపించారు. భూత్పూర్‌లో గ్యాస్ ధరలను నిరసిస్తూ ఆందోళన వ్యక్తం చేశారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద జడ్చర్ల–కల్వకుర్తి ప్రధాన రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

జడ్చర్ల: వంటగ్యాస్ ధరలను పెంచుతూ ప్రభుత్వం సామాన్యులపై మోయలేని భారం మోపుతుందని జెడ్పీ వైస్ చైర్మన్ యాదయ్య తెలిపారు. వంటగ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు.

రాజాపూర్: మండల కేంద్రంలో గ్యాస్ సిలిండర్‌తో బీఆర్ఎస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. మోడీకో హటావో దేశ్‌కి బచావో అంటూ నినాదాలు చేశారు.

బాలానగర్: మండల కేంద్రంలోని ముఖ్య కూడలి వద్ద కట్టెల పొయ్యితో వంటలు చేసి బీఆర్ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు.

నవాబుపేట: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు గ్యాస్ సిలిండర్లతో నిరసన కార్యక్రమం చేపట్టారు.

గండేడ్: మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్లతో రాస్తారోకో నిర్వహించారు. కేంద్రం తీరును ప్రజలు గమనిస్తూనే ఉన్నారని, తిరుగుబాటు చేయడం ఖాయమని అన్నారు. అనంతరం మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మహమ్మదాబాద్: గ్యాస్ ధరలకు నిరసనగా మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వచ్చే రోజుల్లో కేంద్ర ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.



దేవరకద్రలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు



మహమ్మదాబాద్‌లో..



భూత్పూర్‌లో ..



జడ్చర్లలో..

కాంగ్రెస్‌తోనే సుపరిపాలన సాధ్యం



జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచి కేంద్రంలోని మోడీ సర్కార్ పేదల ప్రజలపై భారం మోపుతున్నదని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి ఆరోపించారు. పెంచిన వంటగ్యాస్ ధరలకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో నిరసన చేపట్టారు. వినూత్నంగా రోడ్డుపై కట్టెల పొయ్యి వెలిగించి నిరసన తెలిపారు. బీజేపీ పాలనలో తిరిగి కట్టెలపొయ్యికి వెళ్లాల్సిన పరిస్థితులు దాపురించాయని విమర్శించారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, జిల్లా ప్రచార కార్యదర్శి సీజే బెనహర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, నాయకులు సాయిబాబా, అవేజ్ పాల్గొన్నారు.

గండేడ్: కాంగ్రెస్ పార్టీతోనే దేశంలో, రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని వికారాబాద్ డీసీసీ అధ్యక్షుడు, పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కొంరెడ్డిపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇటింటికీ తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలను ఎండగట్టారు. కార్యక్రమంలో పరిగి నియోజకవర్గ ఇన్‌చార్జ్ సంజీవ్ ముదిరాజ్, మండలాల అధ్యక్షులు నరసింహారావు, నారాయణ, జితేందర్‌రెడ్డి, సర్పంచ్‌లు పుల్లారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సామాన్యులపై అదనపు భారం



ప్రధాని దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అడ్డూ అదుపు లేకుండా నిత్యావసర వస్తువుల ధరలు పెంచుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో వంట గ్యాస్ ధరల పెంపుదలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలో ప్రధాని మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బాలకిషన్ మాట్లాడుతూ చమురు బ్యారెల్ ధరలు తగ్గినా దేశంలో పెట్రోల్, గ్యాస్ ధరలు మాత్రం పెరుగుతూనే ఉన్నాయన్నారు. మోడీ సర్కారు కార్పొరేట్ శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారిందన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు సురేష్, రాము, చాంద్‌పాష, కృష్ణ, వెంకటయ్యగౌడ్, పాష, రవి పాల్గొన్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం



నార్లోనికుంట్ల ప్రాథమిక పాఠశాలలో..



దేవరకద్ర సీవీ రామన్ ఉన్నత పాఠశాలలో..



రాచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..

దేవరకద్ర: మండలంలోని పలు పాఠశాలల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని నార్లోనికుంట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠ్యంశాలు బోధించారు. సర్పంచ్ రామాంజనేయులు విద్యార్థులను అభినందించి బహుమతులు అందజేశారు. మండల కేంద్రంలోని సీవీ రామన్ ఉన్నత పాఠశాల విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. డీఈఓగా అభినవ్, ఎంఈఓగా రాహుల్, ప్రిన్సిపాల్‌గా నందిని, వైస్ ప్రిన్సిపాల్‌గా కీర్తనతో పాటు మరో 40విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ జోబీథామస్ బహుమతులను అందజేశారు.

అడ్డాకుల: మండలంలోని రాచాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్ఎంగా వినోద్, ఎంఈఓగా పూజిత, డీఈఓగా అనిల్, ఉపాధ్యాయులుగా చందన, మహేష్, హుస్సేన్, చందు, రామస్వామి, లావణ్య, కవిత, శ్రావ్య, నవీన్, విజయ్, తేజ, నందిని భాగ్యలక్ష్మి, ప్రణతి, దిన, పూజ, శివ, జ్యోతి, రజిత తదితరులు వ్యవహరించారు. ఎంఈఓ నాగయ్య, ఇన్‌చార్జ్ హెచ్ఎం జనార్ధన్‌రెడ్డి, పీఈటీ రాజవర్ధన్ రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ జగన్నాథం పాల్గొన్నారు.

కంటి వెలుగుపై అవగాహన కల్పించాలి



అన్నాసాగర్‌లో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

భూత్పూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కంటి వెలుగుపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రవినాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని అన్నాసాగర్‌లో చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంటివెలుగు కార్యక్రమాన్ని గ్రామాల్లో ప్రతి ఇంటికీ తెలిసేలా అవగాహన కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి కృష్ణ, డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.భాస్కర్ నాయక్, డా.వినోద్ కుమార్, అప్తాల మెట్రిక్ దత్తాత్రేయ, సీహెచ్ఓ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వినియోగించుకోండి..

అడ్డాకుల: ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంకలమద్ది సర్పంచ్ స్వరూప పిలుపునిచ్చారు. మూసాపేట మండలం సంకలమద్దిలోని మండల కార్యాలయం సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో రుద్రాభిషేకం



నవాబుపేట: కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వేదమంత్రాల మధ్య బిల్వపత్రితో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. శనివారం అగ్నిగుండం, రథోత్సవం, శకటోత్సవ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఉత్సవ కమిటీ సభ్యులు రాజేష్, ఉదయ్, సర్పంచులు పాండు, శ్రీనివాస్ తెలిపారు.

పాఠశాలల్లో విస్తృత ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న టీఎస్ యూటీఎఫ్ మహిళా ప్రతినిధులు



మహమ్మదాబాద్‌లో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీఎస్ యూటీఎఫ్ బలపరిచిన స్వతంత్ర అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు చావా దుర్గాభవాని పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని ధర్మాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాల, రాంరెడ్డిగూడెం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కస్తూర్బా పాఠశాల, గిరిజన గురుకుల పాఠశాలల్లో టీఎస్ యూటీఎఫ్ మహిళా ప్రతినిధులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ మహిళా ప్రతినిధులు కనకమ్మ, జయంతి, హేమలత, పి.రాధ, శాంతాబాయి తదితరులు పాల్గొన్నారు.

భూత్పూర్: పట్టణంలోని కేజీవీబీ, జెడ్పీ ఉన్నత పాఠశాల, రాజీవ్ స్వగృహలోని మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే బాలికల పాఠశాలల్లో ఎమ్మెల్సీ అభ్యర్థి పాపన్నగారి మాణిక్‌రెడ్డి ప్రచారం నిర్వహించారు.

ప్రశ్నించే వారు లేకే నిర్లక్ష్యం..

జడ్చర్ల టౌన్: ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలను లేవనెత్తి పరిష్కారం దిశగా కృషిచేస్తానని ఎస్టీయూ అభ్యర్థి భుజంగరావు పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని పలు జెడ్పీ హైస్కూల్, కళాశాలల్లో ఆయన ప్రచారం నిర్వహించి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు తాహేర్ పాల్గొన్నారు.

పీఆర్‌టీయూతోనే సమస్యలు పరిష్కారం

మహమ్మదాబాద్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో పీఆర్‌టీయూ ముందుంటుందని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘురాంరెడ్డి తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం మండలంలోని జూలపల్లి, నంచర్ల, మహమ్మదాబాద్ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నర్సిరెడ్డి, ప్రేమ్‌గిరి, విజయానందర్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, హరికృష్ణ, ఓం ప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



దేవరకద్ర రూరల్: మండలంలోని కౌకుంట్లకు చెందిన కుమ్మరి నర్సింహులు రెండేళ్ల కిందట అనారోగ్యానికి గురై మృతిచెందాడు. శుక్రవారం మృతుడి కూతురు కృష్ణవేణి వివాహం సందర్భంగా సామాజికవేత్త పవన్‌కుమార్ యాదవ్ రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. పవన్‌కుమార్‌కు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జడ్చర్ల టౌన్: హైనా దాడిలో మేకలు మృతిచెందిన బాధితుడు అశోక్‌కు శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ లక్ష్మారెడ్డి అందజేసిన రూ.25వేల ఆర్థికసాయాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి అందజేశారు. బుధవారం ఎమ్మెల్యే బాధితుడిని పరామర్శించి ఆదుకుంటామని తెలిపిన మేరకు ఆర్థికసాయం పంపించినట్లు తెలిపారు.

అండగా ఉంటాం..

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఇటీవల గుండె ఆపరేషన్ చేసుకున్న పట్టణంలోని బండ్లగేరికి చెందిన ఆంజనేయులుకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పాలమూర్ అభివృద్ధి ఫోరం నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు మున్నూర్‌రవి అన్నారు. శుక్రవారం ఆంజనేయులును ఫోరం నాయకులు పరామర్శించారు.

తెగుళ్లకు నివారణ చర్యలు చేపట్టాలి

చిన్నచింతకుంట: వరిసాగులో తెగుళ్ల నివారణకు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి రాజేష్‌ఖన్నా రైతులకు సూచించారు. శుక్రవారం మండలంలోని అప్పంపల్లిలో రైతులు సాగు చేసిన వరిపంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ యాసంగి వరిపంటకు తెగుళ్లు సోకుతున్నాయని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలన్నారు.

ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి చూపాలి..

భూత్పూర్: రైతులు ఆయిల్‌పాం సాగుపై ఆసక్తి చూపాలని ఏడీఏ యశ్వంత్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని తాటిపర్తిలో నిర్వహించిన కార్యక్రమంలో ఏడీఏ మాట్లాడుతూ ఆయిల్‌పాం సాగు చేసే రైతులు క్లస్టర్ పరిధిలోని ఏఈఓలకు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలను అందజేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ మురళీధర్, ఏఈఓ మానస, ఎంపీటీసీ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

మహబూబ్‌నగర్ క్రైం: నాలుగు రోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఓ మహిళ మృతి చెందింది. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా కేంద్రంలోని మర్లు ఏరియాకు చెందిన కమలమ్మ(55) అదే ప్రాంతంలో కూలీ పనులు చేస్తూ ఒంటరిగా జీవనం సాగించేది. ఫిబ్రవరి 27న మూర్ఛ రావడంతో స్థానికులు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స కోసం తరలించారు. ఆస్పత్రిలో నాలుగు రోజుల పాటు చికిత్స పొంది మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, సంబంధికులు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

అంగన్‌వాడీ టీచర్ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

మహబూబ్‌నగర్ రూరల్: అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యల పరిష్కారం కోసం కదం తొక్కారు. శుక్రవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో మున్సిపల్ టౌన్‌హాల్ నుంచి నూతన కలెక్టరేట్ వరకు వందలాది మంది టీచర్లు, ఆయాలు పాదయాత్రగా వెళ్లి కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనాలోచితంగా ఐసీడీఎస్‌కు 50శాతం బడ్జెట్ తగ్గించి క్రమంగా ప్రైవేటీకరించడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. కనీస వేతనాల అమలు కావడం లేదని, నిరంతరం ఆన్‌లైన్‌లో అంగన్‌వాడీ టీచర్లు ఉండేలా తీవ్రమైన ఒత్తిడికి పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. జీఓ 8, 19 సవరించాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని, సీనియారిటీ ప్రకారం విద్యార్హత ఆధారంగా పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట టీచర్లు, ఆయాలు సుమారు రెండు గంటల పాటు బైఠాయించారు. వంటావార్పు భోజన కార్యక్రమాలు చేపట్టారు. విషయం తెలుసుకున్న డీడబ్ల్యూఓ జరీనాబేగం ఆందోళనకు దిగిన టీచర్ల దగ్గరకు చేరుకుని వినతిపత్రం స్వీకరించారు. కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకుడు కిల్లె గోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లవెల్లి కురుమూర్తి, చంద్రకాంత్, రాజ్‌కుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పుష్పలత, ప్రధాన కార్యదర్శి ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

మిడ్జిల్: నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండ మండలంలోని గుడిగాన్‌పల్లికి చెందిన కుమ్మరి రాంచంద్రయ్యకు 14ఏళ్ల కిందట తలకొండపల్లి మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన కుమ్మరి కవితతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కవిత మతిస్థిమితం సరిగా లేకపోవడంతో శుక్రవారం ఆస్పత్రికి వెళ్లి ఇప్పటి వరకు తిరిగి రాలేదని తెలిపారు. ఎక్కడ వెతికినా కనిపించకపోవడంతో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. మహిళ తమ్ముడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్మికుడి మృతి

బాలానగర్: గుండెపోటుతో కార్మికుడు మృతిచెందిన సంఘటన మండలంలోని స్టీల్ పరిశ్రమలో శుక్రవారం ఉదయం చోటుచేసుకుందని పరిశ్రమ వర్గాలు తెలిపినట్లు ఎస్‌ఐ జయప్రసాద్ తెలిపారు. మండలంలోని ఉడిత్యాల ఈదమ్మగడ్డ తండా సమీపంలోని స్టీల్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న బీహార్‌కు చెందిన హరీష్‌రాం(42)కు శుక్రవారం ఉదయం గుండెపోటు రాగా, ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందినట్లు పరిశ్రమ వర్గాలు తెలిపాయన్నారు. మృతుడి భార్య బిహార్‌లో ఉంటుందని, పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇంట్లో చోరీ

మహబూబ్‌నగర్ క్రైం: తాళం వేసిన ఇంటిని లక్ష్యంగా చేసుకుని గుర్తు తెలియని వ్యక్తులు తలుపులు పగలకొట్టి బీరువాలో ఉన్న బంగారు ఎత్తుకెళ్లారు. రూరల్ ఎస్‌ఐ వెంకటేశ్వర్లు కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని బీఎస్ రెడ్డిలో నివాసముంటున్న రాజేష్ కుటుంబంతో కలిసి ఈనెల 2న స్వగ్రామానికి వెళ్లాడు. రాత్రికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తలుపులు పగలకొట్టి బీరువాలో ఉన్న రెండు తులాల బంగారం, నాలుగు తులాల వెండి ఎత్తుకెళ్లారు. బాధితుడు రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.